వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 02 ఏప్రిల్ 2025

## కడప కలెక్టర్‌తో జగన్మోహన్ రాజు భేటీ

### ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు 3.56 కోట్లు మంజూరు

రాజంపేట అర్బన్, ఏప్రిల్1 ప్రభాతవార్త



కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ని తెలుగుదేశం పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గానికి చెందిన సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించి త్రాగునీరు, ఇండ్లు, రహదారులు, లాంటి మోలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ను కోరారు. ఈ రెండు మండలాలకు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో 3.56 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఒంటిమిట్ట మండలానికి 2.56 కోట్లు, సిద్ధవటం మండలానికి 97.40 విధులు మంజూరయ్యాయి. ఈ నెలతో ఒంటిమిట్ట మండలంలో 54 పనులు చేపడతారు. సిద్ధవటం మండలంలో 23 పనులు జరగనున్నాయి.

## అభయ ఆంజనేయ స్వామికి విశేష పూజలు

బద్వేలు అర్బన్ , ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):



శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి మరియు అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, సింధూర అర్చనలు, పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది. మంగళవారం నాటి కార్యక్రమంలో ప్రత్యేక అభిషేక దాతలుగా బైసాని శివశంకర్‌రెడ్డి, ధర్మపత్ని సురేఖ కుటుంబ సభ్యులు పాల్గొనగా ప్రత్యేక ఉభయదాతలుగా మదులపల్లె వెంకటసుబ్బయ్య, ధర్మపత్ని గంగాశాలిని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామాలయంలో...

# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఒంటిమిట్ట రామాలయంలో ధ్వజ స్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ పురోహితులు



పవిత్ర జలాన్ని తీసుకువెళుతున్న ఆలయ పురోహితులు, టీటీడీ ఉద్యోగులు

రాజంపేట అర్బన్, ఏప్రిల్1 ప్రభాతవార్త

ఒంటిమిట్ట ఏకశిలానగరంలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. రేపు రామాలయంలో హరిద్రా ఘట నబ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలుసీతారాముల కళ్యాణం నేపథ్యంలో గురువారం హరిద్రా ఘటన సాంప్రదాయ బద్ధంగా జరగనుంది. బ్రహ్మోత్సవాలకు ఈనెల 5 న అంకురార్పణ చేయనున్నారు. ఆరవ తేదీన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్వామికి వాహన సేవలు ఉంటాయి. ఆరో తేదీ ఉదయం ధ్వజారోహణం ఉదయం 9.30 నుండి 10.15 గంటల వరకు వృషభ లగ్నంలో నిర్వహించనున్నారు. రాత్రి స్వామి వారు శేష వాహనంపై విహరిస్తారు. ఏడో తేదీ ఉదయం వేణుగాన అలంకారం జరుగుతుంది. రాత్రి హంసవాహనంపై స్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఎనిమిదో తేదీన ఉదయం వట పత్ర సాయి అలంకారంలో శ్రీరాములవారు భక్తులకు దర్శనం భాగ్యం కల్పిస్తారు. రాత్రి సింహ వాహనంపై పురవీధుల్లో విహరిస్తారు. 9తేదీన ఉదయం నవనీత కృష్ణ. రాత్రి సీతా సమేత శ్రీరాముల వారు తన భక్తుడు హనుమంత వాహనంపై ఊరేగుతారు. 10తేదీ ఉదయం మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి గరుడ సేవ జరుగుతుంది. రాత్రి గరుడసేవ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 11న ఉదయం శివధనుర్భాణ అలంకరణ జరుగుతుంది. రాత్రి సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కళ్యాణం అనంతరం స్వామి గజ వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. 12వ తేది ఉదయం కళ్యాణ రామునిగా సీతారాముల వారు రథోత్సవంలో పురవీధుల్లో ఊరేగుతారు. 13ఉదయంకాళీయమర్ధనాలంకారము జరుగుతుంది. రాత్రి అశ్వాహనంపై సీతారాముల వారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. 14న స్వామికి చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 15వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు. దీంతో స్వామి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం చర్యలు

## ప్రతి గ్రామంలో నీటి తొట్లను ఏర్పాటు చేయాలి



సాంబేపల్లి, ఏప్రిల్1 ప్రభాతవార్త

వేసవిలో పశువుల సహతీ తినిపించడానికి ప్రతి గ్రామంలో నీటి తోటల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు మంగళవారం. మండల పరిధిలోనే నాగిరెడ్డి పల్లెలో పశువుల తాగునీటి తొట్టె నిర్మాణానికి మరియు సేద్యపు నీటి కుంట ఫారం పాండ్ నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రారంభించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతుల సమస్యల పరిష్కరించేందుకు, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు నీటి సంరక్షణ చర్యలు చేపట్టి.. భూగర్భ జలాల వృద్ధికి కూడా ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఇందులో భాగంగా గ్రామాలలో సేద్యపు నీటి కుంట ఫారం పాండ్లను విస్తృతంగా మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలలోత్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు రైతులు, గ్రామాలలోని ప్రజలందరూ ప్రభుత్వ చర్యలకు సహకరిస్తూ గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించేందుకు భాగస్వాములు కావాలి. అలాగే ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలు అభివృద్ధి చెందాలని అన్నారు . ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, తాసిల్దారు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, మాజీ జెడ్పిటిసి నరసారెడ్డి మల్లు విష్ణువర్ధన్ రెడ్డి రవీంద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి, బిజెపి నాయకుల రేపన శివప్రసాద్ ఎంపీటీసీ రామ్ రాజ్ బంజారా నాయకుడు ఆఖండ నాయక్ ఉపాధి సిబ్బంది మండల స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చౌక దుకాణం ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకోలు

వాల్మీకిపురం ఏప్రిల్ 01 ప్రభాతవార్త:



చౌక దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

పట్టణశివార్లలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో చౌక దుఖాణం ఏర్పాటు చేసి ఇక్కడ నివాసముంటున్న దాదాపు వేయి కుటుంబాల ప్రజలను ఆదుకోవాలని కోరుతూ కాలనీ ప్రజలు మంగళవారం ఇందిరమ్మకాలనీ రోడ్డుపై బైఠాయించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకిపురం పట్టణానికి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే దాదాపు 2 కిలో మీటర్ల దూరం ఉందని, ఆటోలో వెళ్లాలంటే రూ. వంద బాడుగ ఇవ్వాలని వాపోయారు. వృద్ధులు, వయోవృద్ధులు, వికలాంగులు వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే వ్యయప్రాయాసలకు లోనౌతున్నారన్నారు. అందులోనూ జాతీయ రహదారిపై వెళ్లాలంటే ప్రమాదకరంగా మారిందన్నారు. ఇప్పటికైన తహసీల్దార్ స్పందించి కొత్త ఇందిరమ్మ కాలనీలో ఒక చౌకదుఖాణం ఏర్పాటు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్డుదారులు ఖాదర్ హుస్సేన్, రెడ్డిబీూ, గంగాధర్, సుజాతమ్మ, కుమారి, నీలమ్మ, లక్ష్మమ్మ, సునీత, ఇమాబ్బీ, పరుశురెడ్డి, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు పంచ ప్రాధాన్యాలు

రాయచోటి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు... రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా పంచ ప్రాధాన్యాల లక్ష్యాన్ని నిర్దేశించిందని... ఈ మేరకు వివిధ అభివృద్ధి పథకాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్దేశించిన పంచ ప్రాధాన్యాలలో భాగంగా పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టుట, లక్ష్యం మేరకు ఫారం పాండుల నిర్మాణం, పంట కాలువల పూడిక తీత, సాగునీటి చెరువులలో పూడిక తీత, ఉపాధి కూలీలకు సగటు వేతనం రోజుకు కనీసం 290 రూపాయలు ఉండేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు 2025 26లో మొదటి త్రైమాసికానికి రూ.266 కోట్ల లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఇందులో భాగంగా... రూ.85.52 కోట్ల అంచనాతో 11వేల ఫారం పాండ్ల నిర్మాణం, రూ.21.71 కోట్ల అంచనాతో పంట కాలువలలో పూడికతీత, రూ.3.47 కోట్ల అంచనాతో 1034 పశువుల నీటి తొట్టెల నిర్మాణం, రూ.5.56 కోట్ల ఖర్చుతో సాగునీటి చెరువులలో పూడిక తీయుట, అలాగే రూ.150.43 కోట్ల అంచనాతో వేతన జీవులకు 49 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రజలకు ఆదాయం చేకూర్చే అతి పెద్ద రంగం లైవ్ స్టాక్ గా గుర్తించడం జరిగింది. దీన్ని మరింత ప్రోత్సహించేందుకు మరియు పశువుల మేత సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ ఏడాది పదివేల ఎకరాలలో జిల్లాలో పశుగ్రాసం పెంచేందుకు ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఒక్కొక్క నియోజకవర్గంలో దాదాపు 1500 ఎకరాలు, ప్రతి మండలంలో దాదాపు 500ఎకరాలలో పశుగ్రాసం పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈ మేరకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంలో వార్షిక లక్ష్యాలను కూడా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వార్షికంగా రూ.100 కోట్ల అంచనాతో సిసి రోడ్లు, 3వేల మినీ గోకులాలు ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ.243.74 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి 202425 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులు అనుసంధానంతో రూ.243.74 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాం. ఇందులో 10 కోట్ల రూపాయల ఖర్చుతో 1272 ఫాం పాండ్లను పూర్తి చేశాం. 15 కోట్ల రూపాయలతో 1125 పశువుల మినీ గోకులం షెడ్లను పూర్తి చేసుకుని ప్రగతిలో రాష్ట్రంలో మూడవ స్థానం సాధించాం. అలాగే రూ73 కోట్లతో 322.78 కిమీ సప్లై చానల్స్ పనులు పూర్తి చేశారు. జిల్లాలో 2027 మంది రైతులకు సంబంధించి 3600 ఎకరాలలో రూ.42 కోట్లతో ఉపాధి హామీ క్రింద ఉద్యాన పంటల పనులు చేసాం. రూ. 74 లక్షల ఖర్చు... 75 కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్, 26 ఎకరాలలో బ్లాక్ ప్లాంటేషన్, 15 ఎకరాలలో ఇన్స్టిట్యూషనల్ ప్లాంటేషన్ చేయడం జరిగింది. అలాగే రూ. 4.37 కోట్లు ఖర్చు చేసి 1232 మంది రైతులకు సంబంధించి 1068 ఎకరాలలో పశుగ్రాసం సాగు చేయడం జరిగింది. అదేవిధంగా రూ. 35 కోట్లతో 1598 చెరువులలో పూడికతీత పనులు, రూ.68 కోట్లు అంచనాతో 174 కిమీల సిసి రోడ్లు నిర్మించడం లక్ష్యం కాగా ఇప్పటికే 150కిమీల సిసి రోడ్లు నిర్మించుకున్నామని వివరించారు. అటవీ పరిధిలోని రహదారులకు అనుమతులు వచ్చిన వెంటనే అవి కూడా పూర్తి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి ద్వారా జీవనోపాధిజిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి జీవనోపాదులను వృద్ధి చేయడానికి కృషి చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా 202425లో (గత ఏడాది) రూ.308.47 కోట్లు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేయడం జరిగింది. ఇందులో 88 లక్షల పని దినాలు ఉపాధి కల్పించి వేతనాల కింద దాదాపు రూ.230 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ రూ.78.47 కోట్లు చెల్లించి 95 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే 1.53 లక్షల కుటుంబాలకు, 2.31 లక్షల వేతన జీవులకు ఉపాధి పనులు కల్పించామని, రోజుకు సగటు వేతనం రూ.261 చెల్లించినట్లు కలెక్టర్ తెలిపారు.

### రూ.7.95 కోట్లతో నీటి ఎద్దడికి కంటిన్యూజెన్సీ ప్రణాళిక ప్రతిపాదన

జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి రూ.7.95 కోట్లతో కంటిన్యూజెన్సీ ప్రణాళికను ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం 116 గ్రామాలలో నీటి సరఫరా జరుగుతోందన్నారు, వేసవి దృష్ట్యా రాబోయే కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో దాదాపు నాలుగు నుంచి ఐదువేల పంపుసెట్లు ఉండగా, ఇందులో దాదాపు 1500 పంపు సెట్లకు మరమ్మత్తులు చేయించామని, డిఎంఎఫ్ పథకం ద్వారా బోర్ వెల్స్ చేపట్టడం జరుగుతుందని, అలాగే సిపిడబ్ల్యు స్కీం సక్రమంగా పనిచేసేలా ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని, అయితే రబీ సీజన్ లో నమోదైన వర్షపాతం ఆధారంగా నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ప్రస్తుతం కరువు మండలాలను ప్రకటించలేదని పాత్రికేయులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా ఏడిబి పథకం కింద జిల్లాలో 380 కిలోమీటర్ల మేర ప్రాధాన్యత రోడ్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరిగినట్లు దృష్టికి వస్తే తప్పనిసరిగా తగిన చర్యలు తీసుకుంటామని, పీలేరులో 600 ఎకరాలు సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. వేసవిలో మామిడి పూత రాలిపోవడం, నకిలీ విత్తనాలు అంశంలో ఆయా సంబంధిత శాఖల ద్వారా నివారణ చర్యలు తీసుకుంటామని, అనుమతిలో లేని నీటి ప్లాంట్ల పై ఆర్డబ్ల్యూఎస్ మరియు మున్సిపల్ కమిషనర్ల ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామాపిడి వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీఐ చేతుల మీదుగా ప్రశంసా పత్రం

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 01 ప్రభాత వార్త :



బద్వేల్ అట్లూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శేఖర్ బాబు విధి నిర్వహణలో వారి సేవలను గుర్తించి జిల్లా ఎస్పీ పంపిన ప్రశంసా పత్రాన్ని సీఐ నాగభూషణ్ ఎస్ఐ రామకృష్ణ చేతుల మీదు మంగళవారం సాయంత్రం బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్లో ప్రశంసా పత్రాన్ని శేఖర్ బాబు అందుకున్నారు, అనంతరం సీఐ నాగభూషణ్ ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో శేఖర్ బాబు ఎంతగానో కృషి చేశారన్నారు, వారి సేవలను గుర్తించి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రశంసా పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు,, రాబోయే రోజుల్లో విధి నిర్వహణలో తమ సేవలు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని వారిని అభినందించారు

# ఆసరా కోల్పోయిన అనాధ వృద్ధులకు చేతనందిస్తా



బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త యాదాల కృష్ణమూర్తి జన్మదిన పురస్కరించుకొని ఆనంద నిలయం అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు ఇలా ఇంతమంది పెద్దల ముందు జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆశ్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. అలాగే అందరూ కలిసిమెలిసి ఉంటూ ఒక కుటుంబం లాగా జీవించాలని వారికి సూచించారు. అలాగే అక్కడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అన్నదానం అనంతరం పండ్లు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు విడతల రవికుమార్ మాట్లాడుతూ కృష్ణమూర్తి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుమారు పది లక్షల వ్యయంతో ధ్యాన మందిరం నిర్మించడం ఇందుకు ఒక ఉదాహరణ అన్నారు. ఇలాంటి వ్యక్తి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆయనకు ఎల్లప్పుడూ ఆ దేవుని ఆశీస్సులు ఉండాలని రవికుమార్ ఆకాంక్షించారు. అనంతరం ఆశ్రమంలోనే వృద్ధులు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు




# మండల సర్వతో ముఖాభివృద్ధి కృషి.. : ఎమ్మెల్యే

రామసముద్రం ఏప్రిల్ 1 ప్రభాతవార్త

మండలసర్వతో ముఖాభివృద్ధి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజాహాన్ బాషా తెలిపారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి మంగళవారం మండల పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామం లో పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 3 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించామని, తాగునీటి కోసం అవసరమైన చోట, కొత్త బోర్లు వేయటానికి కృషి చేస్తామన్నారు. రాబోయే వేసవిని ద్రుష్టి ఉంచుకొని తాగునీటి అవసరాలకోసం కొత్త బోర్లు, ఓవర్ హెడ్ ట్యాంక్ లు నిర్మించాలని ఎంపిడిఓ భానుప్రసాద్‌కు ఆదేశాలించారు. ఇందుకు సంబందించిన స్థలమును చూడాలని తాహిసీల్దార్ నిర్మలాదేవిని ఆదేశించారు. అలాగే సంఘ మిత్రాల కార్యకలాపాలు నిర్వహించడానికి మండలంలోని అన్ని సంఘాలకు భవనాలకు స్థలాలు చూపాలని తాహిసీల్దార్‌కు ఆదేసించారు. మదనపల్లి రామసముద్రం రోడ్డు విస్తరణ పనులు, మండలానికి హంద్రీ నీవా జలాలు తీసుకురావడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రెండునెలల్లో పారిశుద్యం కోసం మురికి కాలువలు నిర్మాణం కోసం చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే షాజాహాన్ బాషా తెలిపారు. ఇందులో భాగం



గా పశువుల నీటి తొట్టెలు నిర్మాణం కోసం కాప్పల్లె గ్రామంలో ఎమ్మెల్యే షాజాహాన్. బాషా, టిడిపి నాయకులు లోకనాథ్ రాజు, టిడిపి నాయకులు భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిప్పన్న, టిడిపి నేతలు రూపేష్ రెడ్డి, అన్సర్ బాషా సీతారామస్వామి చెంబకూరు వెంకటేష్, ఇలియాజ్ భాషా, నడింపల్లె రమేష్, మండల బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డెప్ప, హోటల్ నారాయణ స్వామి, ఏపిమోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, ఏపిఓ మాధవి, ఏపీఎం సాంబశివ, పంచాయతీ సెక్రటరీ, విఆర్ఓ లు పాల్గొన్నారు.

## తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

### పీలేరులో భారీగా నగదు, బంగారు ఆభరణాలు చోరీ



చోరీ ఇంట్లో చల్లాచదురుగా పడిన వస్తువులు

పీలేరు ఏప్రిల్ 01 ప్రభాతవార్త:

తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు ఇళ్లల్లోకి చొరబడి భారీగా నగదు, బంగారు నగులు, వెండి వస్తువులను ఎత్తెకెళ్లిన సంఘటన సోమవారం రాత్రి పీలేరు మండలంలో చోటు చేసుకుంది. పీలేరు. తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి నగర్ కు చెందిన అశోక్, క్రిష్ణవేణి దంపతులు సాఫ్ట్వేర్ ఉద్యోగులు పక్క వీధిలో ఉంటున్న మాజీ సైనికుడు శ్రీనివాసులు నివాసముంటున్నారు. వీరు సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగే దైవ కార్యానికి వెళ్లారు. వీరి ఇళ్లకు సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం ఉదయం అశోక్ సెల్ ఫోన్లో సీసీ టీవీ ఫుటేజ్ ను పరిశీలించడంతో ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించాడు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో పీలేరుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై లోకేశ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన రెండు ఇళ్లలో వేలి ముద్రల నిపుణులు గుర్తులు సేకరించారు. పోలీసు. జాగిలాతో గాలింపు చర్యలు చేపట్టారు. దుంగులు ప్రధాన గేటుకు గేట్లు వేసి ఉండడంతో మొదట గోడదూకి ఇళ్ల ఆవరణాల్లోకి ప్రవేశించిన దుండగులు సీసీ కెమరాలకు దొరక్కుండా వాటిని ధ్వంసం చేశారు. లోపల ఉన్న సీసీ కెమెరాలకు వైర్లు కత్తరించి ఎలాంటి ఆనవాళ్ళు కనబడకుండా చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అశోక్ ఇంట్లో 90 గ్రాముల బంగారు అభరణాలు, రూ.3.50 లక్షల నగదు, కిలో వెండి వస్తులు, మాజీ సైనికుడు శ్రీనివాసులు ఇంట్లో 250 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.7.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి. దర్యాప్తు చేస్తున్నాయని సీఐ యుగంధర్ తెలిపాడు.

## ఆప్కాస్‌ను రద్దు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :

ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికులను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని తెలిపింది. అయితే అప్పటి ప్రభుత్వం ఉన్న కాంట్రాక్టు, ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వం ఆప్కాస్ అనే సంస్థను నిర్వహించి కార్మికులకు జీతాలు చెల్లించే పద్ధతి తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి తిరిగి కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికి ఏజెన్సీ విధానాలను తీసుకువస్తామని తెలపడం సబబు కాదన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ది ఉంటే వెంటనే ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆప్కాస్‌ను తొలగించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోతే ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంప్లాయిస్ పెడరేషన్ అధ్యక్షుడు చలపతినాయుడు, ప్రధానకార్యదర్శి సాంబశివ నాయక్, కోశాధికారి రామక్రిష్ణ, రాజు, గోపాల్, చిన్నరెడ్డప్ప, నరసింహులు, బాలక్రిష్ణ, అరవింద్, చంద్ర, సభ్యులు క్రిష్ణప్ప, చంద్ర, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లతో

# వృద్ధుల కళ్ళల్లో ఆనందం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టిన్ భద్రత పెన్షన్లతో వృద్ధులు, వికలాంగుల్లో ఆనంద ఉత్సవాలు నిలుపు కుంటున్నాయని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. మంగళవారం మదనపల్లె అర్బన్, రూరల్ మండలాల్లో ఎమ్మెల్యే చేతులమీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. నీరుగట్టువారిపల్లి వివేకానంద మున్సిపల్ పాఠశాల వద్ద మున్సిపల్ కమీషనర్ ప్రమీల ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వృద్ధాప్య పెన్షనను పంపిణీ చేశారు. అనంతరం కోళ్ళబైలు-2 పంచాయితీ పరిధిలోని ఉర్దూస్కూల్ వద్ద పెన్షన్లను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి సచివాలయ సిబ్బందితో కలసి పంపిణీ చేశారు. ఒకటవ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లికార్జుననాయుడు, డ్యాన్స్ రెడ్డప్ప, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీచేశారు. సూపర్‌సిక్స్ పథకాలలో మూడు ఉచిత సిలిండర్లు, రైతుల భూముల చట్టాలపై ఆంక్షలు తొలగించడం, పెంచిన పెన్షన్లను ఒకటో తేదిలోపే అందించడం వంటి కార్యక్రమాలు అందించి మాట నిలుపుకొన్న నాయకుడుగా చంద్రబాబునాయుడు ప్రసంశలు అందుకుంటున్నారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు నీలకంఠ, మోడెం సిద్దప్ప, పురుషోత్తం, పవన్, మూడో వార్డు ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, తలకాయల శ్రీనివాసులు, జాఫర్, సీతక్క యుగంధర్, కత్తి లక్ష్మన్న, బాలప్పగారి వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## చలివేంద్రం ప్రారంభించిన ఇన్‌ఛార్జి మండల తహసీల్దార్

సిద్దవటం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన సిద్దవటం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇన్‌ఛార్జి మండల తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ మాధవీలత మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకొని కార్యాలయానికి ఇతర పనుల మీద వచ్చే ప్రజలకు వేసవిని దృష్టిలో ఉంచుకొని దాహం తీర్చడానికి నూతన చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పల్లె ప్రాంతాల ప్రజలు గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలని మంచినీరు, కొబ్బరి బొండాలు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి ఆర్ ఐ శ్రీనివాసులు, వీఆర్వో కేశవులు, వీఆర్ఏ వెంకటపతి పాల్గొన్నారు.

## ల్యాండ్ కన్వర్షన్ కోసం...



సిద్దవటం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:

మండలంలోని టక్కోలు గ్రామ రైతు తన పట్టా భూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంగళవారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పరిశీలించారు. టక్కోలు గ్రామానికి చెందిన దుంపల అశోక్‌రెడ్డి సర్వే నెంబర్ 429/1, 429/2, 430లలోని తన పట్టా భూమి 4 ఎకరాల 85 సెంట్లలో అగ్రికల్చర్ గోడౌన్ నిర్మాణం కోసం ల్యాండ్ కన్వర్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కడప ఆర్డీవో పరిశీలించి రైతు పట్టా భూమి హద్దులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత మాట్లాడుతూ రైతుకు సంబంధించిన పట్టా భూమిలో ఏదైనా కట్టడాలు నిర్మించాలన్నా ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, విలేజ్ సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్వో సంటయ్య, వీఆర్ఏ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల తొట్టెల నిర్మాణ పనులు ప్రారంభం

కలికిరి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాలలో మూగ జీవాలైన పశువులు, గొర్రెలు, మేకల దాహార్తి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం పశువుల తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ అన్నారు. మంగళవారం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో భానుమూర్తిరావు ఉపాధి హామీ పథకం ఏపీవో మంజుల పర్యవేక్షణలో స్థానిక పంచాయతీ ప్రజా ప్రతినిధులు పశువుల తొట్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీకి 2 పశువుల తొట్లు మంజూరు కాగా ఆ పనులు స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. మండలానికి 28 పశువుల తొట్లు మంజూరైనట్లు ఏపీవో మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ పశువుల తొట్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులకు, రైతులకు సూచించారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు కూలీలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రెడ్డిబాషా, రవికుమార్, పద్మావతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్‌కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే కలికిరిలో పౌరహక్కుల దినోత్సవం

కలికిరి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:

మండలంలోని కలికిరి పంచాయతీ కె.రెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన చిన్న మాలపల్లెలో ఈ నెల 2వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ మహేశ్వరీభాయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

### సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :

ఆప్కాస్ విధానం రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఆప్కాస్ విధానం రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం పురపాలక కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు గత 23 సంవత్సరాలుగా ఆప్కాస్ విధానంలో పనిచేస్తున్నారన్నారు. వారిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆప్కాస్ రద్దు చేసి కార్మికులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించాలని చూస్తోందని విమర్శించారు. దీనివల్ల కాంట్రాక్టర్లకు లాభాలు తప్ప కార్మికులు నష్టపోతారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ చేసి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, నాయకులు ఓబయ్య, ప్రసాద్, రమణ, ప్రమీల, బాలాజీ, శీను, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి జెండా ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

తంబళ్లపల్లె ఏప్రిల్ 1 ప్రభాతవార్త ః



నిరసన వ్యక్తం చేస్తున్న కూటమి నాయకులు

తంబళ్లపల్లె మండలం కోటకొండ ఎగువ సుగాలి తాండ లో బిజెపి జండా స్తంభం ధ్వంసంపై మంగళవారం కూటమి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్నాళ్ల క్రితం ఎగువ సుగాలి తండాలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్ర నాయక్ ఆధ్వర్యంలో బిజెపి జెండా ఏర్పాటు చేసి పతాకావిష్కరణ గావించారు. గత రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బిజెపి దిమ్మె ధ్వంసం చేసి జెండా కర్రతో సహా మాయం చేశారు. ఈ విషయమై మంగళవారం రాజేంద్రనాయక్, మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు రమణ, అసెంబ్లీ కన్వీనర్ శంకర్ రెడ్డి, టిడిపి నాయకులు కాలా నారాయణ, గురుమూర్తిలు సంఘటనా స్థలానికి చేరుకొని జెండా ధ్వంసం చేయడంపై నిరసన వ్యక్తం చేసి కొందరు దుండగులు చేసిన పిరికిపంద చర్యగా అభివర్ణించారు. తంబళ్లపల్లె ఎస్సై లోకేశ్ రెడ్డికి లిఖితపూర్వపు ఫిర్యాదు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి, కూటమి నాయకులు శివ నాయక్, నాగరాజు నాయక్, వీరభద్ర నాయక్, మల్లికార్జున, జై భీమ్ పార్టీ నాయకుడు కోన భాస్కర్, వెంకటేష్, వైవి రమణారెడ్డి, సమర, డాన్స్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 01 ప్రభాతవార్త



మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి ప్రశాంతంగా ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు 504 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు అందులో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల , ఆదర్శ పాఠశాలలు పరీక్ష కేంద్రాలుగా నిర్వహించారు. మూడు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాస్కాపింగ్ జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు సీఐ కొండారెడ్డి ఎస్సై రవీంద్రలు 144 సెక్షన్లో అమలు చేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేటట్టు చూశారు ఎంఈఓ లు చక్రే నాయక్, వెంకటసుబ్బయ్యలు పర్యవేక్షణలు చేశారు చివరి రోజు సోషల్ స్టడీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు ఇందులో విద్యార్థులు పరీక్షలు ముగిసిన ఆనందంతో ఒకరు కరిచాలన అలంకనం చేసుకుంటూ ఆనందాలతో ఇళ్లకు చేరుకున్నారు.

## దుకాణాల్లో చోరీలు

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 01 ప్రభాతవార్త

మండలంలోని చౌటపల్లి పంచాయతీలోని రవీంద్ర నగరంలో ఓ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు దుకాణంలోని రేకులు తొలగించి దుకాణాలకు చొరబడి రూ.45 వేలు సీక్రెట్ ప్యాకెట్లు కూల్డ్రింక్స్ విలువైన వస్తువులను అపకరించకపోయినట్లు బాధితుడు పవన్ కుమార్ తెలిపారు. దుకాణంలో 4 సీసీ కెమెరాలు అమర్చామని అయినా సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట 30 నిమిషాలకు కరెంటు ఆఫ్ చేసి దుకాణాలకు చొరబడి వస్తువులు 5000 రూపాయలు నగదు సీక్రెట్ ప్యాకెట్ కూల్డ్రింక్స్ ఇతర వస్తువులను అపహకరించకపోయారని పోయారని బాధితులు తెలిపాడు. అలాగే దక్కన్ టీస్టాల్‌లో ఇదేవిధంగా సీక్రెట్ ప్యాకెట్లు కూల్డ్రింక్స్ 40 వేల రూపాయలు వస్తువులను రూపాయల వస్తువులను అపహకరించకపోయినట్లు బాధితులు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి రెండు ప్రాంతాలలో దొంగలు దుకాణంలో చొరబడి వస్తువులను తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు తెల్లవారి చూడగానే దుకాణం పైకప్పులు రేకులు తొలగించి వస్తువులను అపరిచిపోయారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశామని పవన్ కుమార్ తెలిపారు.

## ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 01 ప్రభాతవార్త

మండల పరిధిలోని దప్పేపల్లి గ్రామ పరిధిలో కొండవాండ్లపల్లిలో దాదాపు నెలరోజులుగా తీవ్రమైన తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలతో కలిసి మంగళవారం సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలకు సంబంధించి 24 వేల ఎకరాలకు సాగునీరు, అలాగే త్రాగునీరు అందిస్తున్నామని ఏర్పాటైన ప్రాజెక్టు కనీసం సాగునీరు దేవుడెరుగు చుక్క తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గత తెలుగుదేశం ప్రభుత్వంలో 2018 లో సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని గాలివీడు నుండి కడప జిల్లా కలెక్టరేట్ కు పాదయాత్ర నిర్వహించామని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కార మార్గం చూపడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. కూటమి ప్రభుత్వమైన వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, రఫీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## పశుగ్రాసం వితరణ ఆదర్శవంతం

తంబళ్లపల్లె ఏప్రిల్1 ప్రభాతవార్త ః



పశుగ్రాస ట్రాక్టర్ వద్ద ఎంపీడీవో, నాయకులు

తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండలో మహాశివుని గోమాతలు పశుగ్రాసం లేక ఆకలి కేకలు వేస్తున్నాయి. ఈ సంఘటనపై ఎద్దుల వారి పల్లి పంచాయతీ దండువారి పల్లెకు చెందిన గ్రామస్తులు మానవతా హృదయంతో చలించారు. మంగళవారం గ్రామస్తులు తమ పశువుల గ్రాసం నుండి కొంత వితరణ చేయగా ఆ పశువుల మేతను ట్రాక్టర్లో టిడిపి నాయకుడు రమణ మల్లయ్య కొండకు తరలించారు. ఈ వితరణ పై ఉపేందర్ రెడ్డి, ఏవో థామస్ రాజాలు స్పందించి గోమాతలకు పశుగ్రాసం అందించిన దండువారిపల్లె గ్రామస్తులు మూగజీవాలపై మానవత్వం ప్రదర్శించడంలో ఆదర్శప్రాయులని కొనియాడారు. గోమాతల పశుగ్రాస పంపిణీలో మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు స్పందించాలని ఎంపీడీవోతో పాటు టిడిపి మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, జనసేన మండల నాయకుడు ఎద్దుల నరసింహులు, మదనమోహన్‌రెడ్డి, రాచెరువు అధ్యక్షుడు రామలింగారెడ్డి, గోపి దిన్ని మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ సర్పంచ్ శంకర, శ్రీనివాసులు కోరారు.

## సిద్దవటం కోటలో బాసి ఖుద్బా వేడుకలు

సిద్దవటం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:

సిద్దవటం కోటలో మంగళవారం బాసి ఖుద్బా వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం రంజాన్ వేడుకలు జరుగగా కడప జిల్లా వ్యాప్తంగా ముస్లిం సహోదరులు మరుసటి రోజు అయిన మంగళవారం బాసి ఖుద్బా వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అన్న పానీయాలను వెంట తెచ్చుకొని కోటలో ఆరగించి సంతోషంగా గడిపారు. మొదటి మండపం, ఎపార్కులు, 2వ మండపం, సయ్యద్‌షా షా బిస్మిల్లా షా ఖాద్రి దర్గా, రాణి మహల్, రాజమహల్ వంటి కట్టడాలు ఉన్న ప్రాంతాల్లో కుటుంబ సభ్యులతో గడిపారు.

## పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గాలివీడు, ఏప్రిల్ 1(ప్రభాతవార్త):

వేసవి దృష్ట్యా పిల్లలు ఈత కొట్టడానికి బావులు, చెరువుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిపూట బడులు, పదవ తరగతి పరీక్షలు ముగిసిన క్రమంలో పిల్లలు ఎక్కువగా వేసవిలో చేపలు పట్టుటకు, సేద తీరడానికి స్విమ్మింగ్ పూల్, చెరువులు, బావుల వద్దకు వెళ్తుంటారు. అవి ఎంత లోతు ఉన్నాయో తెలియక, అందులో రాళ్లు, బురద, తీగలు ఉండటంతో అందులో చిక్కుకుని ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. అందుచేత పెద్దలు, ఈతవచ్చిన వారి పర్యవేక్షణలో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## నేడు వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ జిల్లాకు రాక

ప్రొద్దుటూరు ఏప్రిల్ 01, ప్రభాతవార్త



ఏపీ వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ నేడు కడప జిల్లాలో పర్యటించనున్నట్లు ప్రొద్దుటూరు బిజెపి పట్టణ ఒకటవ అధ్యక్షులు వంకదార నరేంద్ర రావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పట్టణంలోని టీవీ రోడ్డు లోని డాక్టర్ స్వరూప్ కంటి ఆసుపత్రిని సందర్శిస్తారన్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు స్థానిక బుద్దాయిపల్లిలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో బిజెపి ప్రధాన కార్యదర్శి ముత్యాలు శ్రీశ్రీ కార్యదర్శులు హరికృష్ణ చిన్న పార్టీ సీనియర్ నాయకులు పరమేశ్వర రావు మరియు నారాయణ మురళి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులను తేల్చుకుంటే భూపోరాటానికి సిద్దం

బద్వేలు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త



ఈనెల 10వ తేదీలోపు అర్హులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయకపోతే 14 తర్వాత ఎంపిక చేసిన ప్రభుత్వ భూములలో అర్హులైన పేదలకు భూ పోరాటం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, చంద్రమోహన్ రాజులు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం నందు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాటాడుతూ వేలాదిమంది కార్మికులు కనీసం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా న్యాయం జరుగుతుందని ఆశించారని, కానీ నేడు ప్రభుత్వం తీసుకున్న నూతన చట్టాల కారణంగా రేషన్ కార్డుల విభజన జరగని కారణంగా వారంతా కూడా ప్రభుత్వ పథకాలకు దూరమవ్వాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 10వ తేదీ లోపు ఇంటి స్థలాలు కేటాయించకపోతే 14వ తేదీ తర్వాత బద్వేల్ మండలం గుంతపల్లి రెవెన్యూ గ్రామ పొలం సర్వే నెంబర్ 948/2,4 మరియు గోపవరం మండలం సెంచరీ ఫ్యాక్టరీ పక్కనే ఉన్న సర్వేనెంబర్ 1557 నందు పెద్ద ఎత్తున అర్హులతో కూడిన పేదలతో భూపోరాటం నిర్వహించి ఎర్రజెండాలు పాతి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి పేదవానికి మూడు సెంట్ల ఇంటి స్థలం చొప్పున పంచుతామని వారు హెచ్చరించారు. లేనిపక్షంలో ఇలాగే ప్రవర్తిస్తే ప్రజలు, ప్రజా శ్రేయస్కురులు, అభ్యుదయవాదులు, ఆలోచన కలిగిన వారు కూడా తమను గౌరవించాలని అనుకోరని ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకొని భూ కబ్జాదారుల పట్ల తమ విధానం ఏంటో రెవెన్యూ అధికారులు తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జకరయ్య నియోజకవర్గ నాయకులు కేబాబు పట్టణ నాయకులు విజయ రావు, చంద్రపాల్, నారాయణ, ప్రసాద్, జయరామరాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనానికి ప్రయత్నించి విఫలం

ముద్దనూరు, ఏప్రిల్ 01,ప్రభాతవార్త:

మండల పరిధిలోని యామవరం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలోకి దొంగతనానికి ప్రయత్నించి ఇంటి ఆవరణంలో ఎటువంటి విలువైన వస్తువులు లేనందున, బీరువా తాళం తెరిచినా రాకపోవడంతో బీరువాలో ఉన్న పదివేల రూపాయల నగదు మరియు విలువైన భూమి పత్రాలను దొంగలించ కుండా వెనుతిరిగి పోయినట్లు బాధితురాలు తమ్మిశెట్టి లక్ష్మీదేవి తెలిపారు. బాధితురాలు వివరాల మేరకు ఎర్రగుంట్ల పట్టణంలో నివాసం ఉన్న తన కూతురికి ఆరోగ్యం సరిగా లేనందున లక్ష్మీదేవి గత నెల 23వ తేదీన ఇంటికి తాళం వేసి వెళ్ళింది. మంగళవారం తిరిగి వచ్చి చూడగా గుమ్మానికి వేసిన తాళం పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి దొంగతనానికి ప్రయత్నించినట్లు వివరించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిసరాలను పరిశీలించి దొంగతనానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఎటువంటి వస్తువులు అపహరించుకుపోనందున ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదన్నారు. మండల ప్రజలు శుభకార్యాలకు, పండగలకు కానీ, ఇంటి నుండి బయటకు వెళ్తున్నప్పుడు జాగ్రత్తగా తాళం చెవులు వేసి, చుట్టుపక్కల వారిని గమనిస్తూ ఉండాలని, ఇంటిలో ఎటువంటి విలువైన వస్తువులను ఉంచకూడదని పోలీసులు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

గాలివీడు, ఏప్రిల్ 1(ప్రభాతవార్త):



మండలంలో మార్చి 17వ తేదీన ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మంగళవారం చివరి పరీక్ష సోషియల్ పేపర్‌తో ప్రశాంతంగా ముగిశాయి. చివరిగా సోషియల్ పరీక్ష మార్చి 31వ తేదీన పూర్తి జరగాల్సి ఉండగా రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించడంతో పరీక్షలు పూర్తయ్యాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పదవ తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. కొన్ని అనివార్య కారణాలు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం కారణంగా కొంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేకపోయారు. మొత్తానికి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగియడంతో అటు విద్యార్థులు, ఇటు అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## విద్యతో ఉన్నత స్థాయికి

రైల్వే కోడూరు ఏప్రిల్ 1 ప్రభాతవార్త...

విద్యతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరవచ్చునని యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ డీన్ ప్రొఫెసర్ కే రఘుబాబు అన్నారు. మంగళవారం కోడూరు పట్టణంలోని ప్రైవేట్ కళ్యాణ మండపం నందు శ్రీ వశిష్ట డిగ్రీ కళాశాల ఫేర్వెల్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ రఘుబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యతో అనంత స్థాయికి చేరవచ్చన్నారు. ముఖ్యంగా రైల్వే కోడూరులో వశిష్ట డిగ్రీ కళాశాలకు చక్కటి పేరు ఉందని చదువుతోపాటు క్రమశిక్షణ కూడా ఈ కళాశాలలో ఎంతో ముఖ్యంగా సంబంధిత కళాశాల సిబ్బంది ఏర్పాటు చేస్తున్నాంన్నారు. కళాశాలలో చదువుతోపాటు ఫలితాలు కూడా విజయవంతంగా తమ విద్యార్థులు ప్రత్యేకతను చూపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫీస్ నుంచి మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్స్ ఎం శీను శరత్ రేవతి ప్రభాకర్ శ్రీ రాములు కిరణ్ నాగమణి మహేశ్వరి చంద్రశేఖర్ రామంజి రెడ్డేశ్వర కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ రఘుబాబును ఘనంగా పూలమాలలతో శాలువాలతో సన్మానించారు.



# తుదిమెరుగులు దిద్దుకుంటున్న అభయాంజనేయ ఆలయం

## రూ,70 లక్షల వ్యయం.. తిరుమలకు వెళ్లే పాదచారులకు వసతి సదుపాయం.. నర్రావాండ్లపల్లె సుధాకర్ రెడ్డి దాతృత్వం





పీలేరు ఏప్రిల్ 01 ప్రభాత వార్త :

పీలేరు కలికిరీ వాల్మీకుపురం మండలాల సరిహద్దు ప్రాంతం నర్రా వాండ్లపల్లి క్రాస్ లో సుమారు రూ.70 లక్షల వ్యయం తో మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో అభయాంజనేయ స్వామి ఆలయం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. గతంలో ఇక్కడ ఉన్న ఆలయం నేషనల్ హైవే ఏర్పాటు కారణంగా తొలగించ బడింది. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో కొంత మేరకు నిధులు మంజూరైనాయి. ఇవి సరిపోకపోవడంతో సుధాకర్ రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయించడంలో సిద్ధహస్తులు గా మిగిలారు. ఇక్కడే గతంలో ఏర్పాటు చేసిన బోరుబావి వచ్చే నీరు యాత్రికులు, పాదచారులకు ఎంతో ఆనందాస్తోంది. చెన్నైకి చెందిన కళాకారులు ఆలయ నిర్మాణపనులు చురుగ్గా చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆలయగోపురం, గర్భగుడి అత్యంత సుందరంగా రూపుదాల్చింది. చూపరులను కట్టిపడేసేలా దేవతారూపాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా నర్రా వాండ్ల పల్లె రోడ్ లోనుండి గుడి వరకూ సిమెంట్ రోడ్ వేయాల్సి వస్తుందని ఇందుకు దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణ పనుల్లో భాగస్వామ్యులు లై అభయాంజనేయ స్వామికి కృపకు పాత్రులు కావాలని ఆలయ ధర్మ కర్త డి. సుధాకర్ రెడ్డి కోరారు. హైవే రోడ్డుకు ఆనుకుని ఆహ్లాదకరమైన ప్రాంతంలో సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణపనులు తుది దశకు చేరుకుంది.

### పూర్వజన్మ సుకృతం

తమిళనాడు తరహాలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేయిస్తున్నాం. ముఖ్యంగా ప్రజలందరిలో భక్తి భావం పెంపొందాలన్నదే నా ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం నా చేతుల మీదుగా చేపట్టడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను.

**డి.సుధాకర్ రెడ్డి నర్రావాండ్లపల్లి... కలికిరీ**

# నీటి తొట్టి నిర్మాణ భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

పీలేరు ఏప్రిల్ 01 ప్రభాతవార్త:

మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 29 పశువుల త్రాగునీటి తొట్టెలు మంజూరైనవి. ఈరోజు ..వెంకట్రరత్నం, పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, (పిడి ) అన్నమయ్య జిల్లా వారు ఎర్రగుంట్ల పల్లి పంచాయతీ ముదుపుల వేముల గ్రామం నందు పశువుల త్రాగు నీటి తొట్టి నిర్మాణమునకు భూమి పూజ చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, మండల పార్టీ అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి , పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి అగ్రహారం అమర్నాథ్ రెడ్డి, ఎర్రగుంట్ల పల్లి పంచాయతీ నాయకులు ముదుపుల వేముల అమర్నాథ్ రెడ్డి, లక్ష్మీకర్, దిన చంద్రారెడ్డి, ప్రభాకర్ రాజు, రెడ్డి శేఖర్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

పీలేరు ఏప్రిల్ 01 ప్రభాతవార్త :



బెట్టింగ్ ఒక విష వలయం అని బెట్టింగ్ కు విద్యార్థులు, యువత, ప్రజలు దూరంగా ఉండాలి అని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ ఆధ్వర్యం లో పీలేరులో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ యువత సరదా కోసం కూడా బెట్టింగ్ జోలికి వెళ్లొద్దు అని అన్నారు. ఈ బెట్టింగ్ యాప్ ల నిర్వాహకులు మొదట లాభాలు చూపించి సర్వం దోచేస్తారని తెలిపారు. బెట్టింగ్ అనేది సరదాగా మొదలై పోను పోను వ్యసనంగా మారుతుందని ఎద్దేవాచేశారు.బెట్టింగ్ వేసిన వారితోపాటు వారి కుటుంబాలను సైతం ఆర్థికంగా బలహీన పరుస్తుందని తెలిపారు. అదేవిధంగా బాధ్యతగల యువకులుగా ప్రజలకు బెట్టింగ్ నష్టాలపై అవగాహన కల్పించి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సి.సాయి సంపత్ కుమార్, అఖిల్, దినేష్, లోకేష్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సహాయం రైతుకు చేరాలి



మైదుకూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన 51 కరువు మండలాల ప్రకటనలో కడప జిల్లా నుండి పది మండలాలు ప్రకటించడం రైతు సేవాసమితి సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి రమణ అభినందనలు తెలిపారు. మైదుకూరులో సమితి నియోజకవర్గ అధ్యక్షుడు. సంజీవ రాయుడు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, రామ్మోహన్,చెక్ పోస్ట్ శ్రీనివాసులతో మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం ఎన్నికల ప్రచారంలో 20 వేల అన్నదాత సుఖీభవ రైతు భరోసా మాదిరి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతున్న ఇప్పటివరకు రాష్ట్రంలో ఏ రైతుకు కూడా ఒక్క రూపాయి సహాయం అందలేదు కరువు మండలాల ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి రైతుకు బ్యాంకులో రుణ సహాయం, అలాగే అన్ని రకాల విత్తన, ఎరువుల సహాయం రైతుకు అందజేయాలని రైతు సేవాసమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

కలకడ ఏప్రిల్ 01ప్రభాతవార్త :




ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీ కదిరాయ చెరువు వడ్డేపల్లికి చెందిన రామయ్య కుమారుడు శంకరకు ఎన్టీఆర్ భరోసా కింద 1000 రూపాయలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో దృఢ సంకల్పంతో నిరుపేదలను ఆదుకునేందుకు పెన్షన్లను పెంపుదల చేసి నిరుపేదల కుటుంబాలను ఆదుకుం టుందని సర్పంచ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి లు రాష్ట్ర అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నారని కొనియాడారు.అనంతరం పంచాయతీ పరిధిలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతి ఉపాధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఆకుమాను కాలువ పనులను పరిశీలించి తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ రహీం, బిపిఎం కమలనాద, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ కార్యవర్గ ఏర్పాటు



మైదుకూరు, ఏప్రిల్ 01, ప్రభాతవార్త:

అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ 20252026 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈరోజు మంగళవారం మైదుకూరు కోర్టు కంప్లెక్స్ నందు ఉన్న అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ కార్యాలయం నందు అడ్వకేట్స్ సర్వసమావేశం జరిగింది. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోమేసుల శివప్రసాద్, ప్రధాన కార్యదర్శులు ఆకుల వెంకట శివరామ్, సహాయ కార్యదర్శులు చిలుంగారి కృష్ణమూర్తి, మహిళా కార్యదర్శులు షేక్ తహసీన్ భాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామిశెట్టి శ్రీనివాసులు, జ్వాలా నరసింహ శర్మ, కామానూరు శ్రీనివాసులు, శ్రీ పి. వి. నారాయణ రెడ్డి, మూలే నాగిరెడ్డి, కోనేటి శ్రీనివాస్, జె. కె. చారి, జె. రవిశేఖర్,బాలవెంకటయ్య,టి. పట్టాభి రాముడు, షేక్ ఇమామ్ భాష, చిలుంగారి పుల్లయ్య, సోమేసుల శివరామ కృష్ణ, మాదం మునిరత్నం, కొట్టె జయరాం, నానుబాల శ్రీనివాస్, అబ్దుల్లా, కరీముల్లా, పోలుదాసు దేవేంద్ర కుమార్, వీరాంజనేయులు, కుమారి సుచిత్ర, బాబయ్య, బి. కె. శ్రీనివాస్, పి. రాఘవ రెడ్డి, గూడు బాయ్ తదితర అడ్వకేట్స్ పాల్గొన్నారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అడ్వకేట్స్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# గ్రామాలలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలి



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

కలకడ ఏప్రిల్ 01 ప్రభాతవార్త :

గ్రామాలలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెవిన్యూ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలకడ మండలాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని బాలయ్య గారి పల్లి పంచాయతీ పెండ్లిమర్రి వాండ్ల పల్లెలో సర్వేనెంబర్ 984/4లో ఉన్న 0.04 సెంట్ల భూమిని తన పేరుతో ఆన్లైన్ చేయాలని వై. సుబ్బమ్మ ఇటీవల పిజిఆర్ఎస్ లో దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా సదరు అంశంపై తాసిల్దారు, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి, రికార్డులను పరిశీలించి, దరఖాస్తు దారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సదరు భూమి వివాదంలో ఉందని తాసిల్దారు కలెక్టరుకు వివరించారు. ఇరు పార్టీలను పిలిపించి సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని తాసిల్దార్ కు కలెక్టర్ సూచించారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఫణికుమార్, మండల సర్వేయర్ దేవి, వీఆర్వో అనంతరాజు, పుల్లయ్య, వీఆర్ఏలు సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పట్టణంలో పుట్ పెట్రోలింగ్ చేపట్టిన ఎస్ఐలు

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త

వాహనదారులు మరియు ఆటో డ్రైవర్లకు, తోపుడు బండి వ్యాపారస్తులు రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని ఎస్సైలు సత్యనారాయణ, చంద్రశేఖర్ లు పేర్కొన్నారు.మంగళ వారం మున్సిపాలిటీ పరిధి పలు ప్రధాన రహదారులలో పుట్ పెట్రోలింగ్ ద్వారా ఎస్ఐ లు సత్యనారాయణ, చంద్రశేఖర్‌లు తమ పోలీస్ సిబ్బందితో కలిసి పలువురు ఆటో వారికి, తోపుడు బండి వ్యాపారస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణ మరియు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలిపి ప్యాసింజర్ వెక్కించుకోకూడదని మరియు డ్రైవింగ్ లైసెన్స్ లాంటి వాటిపై పోలీస్ చట్టాల పైన పలువురికి అవగాహన కల్పించారు.ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరు కూడా పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఆటోకు సంబంధించిన పలు రకాల రికార్డును ఎప్పటికప్పుడు సరి చుసుకుంటూ ఉండాలన్నారు. ముఖ్యంగా విపరీతమైన శబ్దాలు వచ్చేలా ఆటో డ్రైవర్లు సౌండ్ పెట్టరాదని తద్వారా చా లామందికి ఇబ్బందికరంగా మారుతూ వెనకాల వచ్చే వాహనాల హారన్ కూడా మీకు వినిపించగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆటో నడిపేట ప్పుడు మద్యం సేవించి గాని ,మొబైల్ మాట్లాడుతూ గాని నడపడం వలన అనేక ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ఆటో తోలే ప్రతి ఒక్కరు పోలీసు నిబంధనలు పాటిస్తూ ఉండాలని అనంతరం ఆటో వారికి పలు రకాల సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



కడప కార్పొరేషన్ ఏప్రిల్ 1 ప్రభాతవార్త:

కడప శిల్పారామం ఉగాది క్యాలెండర్ ను కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ వీప్ రెడ్డప్ప గారి మాధవి రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం కడప ఎమ్మెల్యే కార్యాలయంలో శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్వైజర్ పి.మధుసూదన్ బాబు ఎమ్మెల్యే మాధవి రెడ్డిని కలిశారు. సా.6 గం.లకు పండగ పర్వదినంగా శిల్పారామంలో సాంస్కృతిక కళావేదికపై మిస్సా మూవీ వారి సహకారంతో పులివెందులకు చెందిన ఎస్కే డాన్స్ అకాడమీ, కడప నగరానికి చెందిన అఖిల్ డాన్స్ అకాడమీ ఒకరి మించి ఒకరు హిందీ సాంగ్ నృత్యములతో, శాస్త్రీయ నృత్యములతో, పుష్ప మూవీ వేషధారణతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి ఎస్ కృష్ణప్రసాద్, ఫీల్డ్‌సూపర్వైజర్ మధుసూదన్ బాబు పర్యవేక్షించారు.

# వేసవిలో పశువుల దాహార్తికి ప్రాధాన్యత



నీటితొట్టెలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో పశువుల దాహార్తికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఇందులోభాగంగా మంగళవారం మదనపల్లె రూరల్ మండలంలోని బసినికొండ పంచాయితీన కనుమలో గంగమ్మ ఆలయ సమీపంలో నీటితొట్టి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. టిడిపి నాయకులు సీతక్క యుగంధర్ కత్తిలక్ష్మన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్ఆర్ఈజిఎస్ అధికారులు, ఎంపిడిఓ తాజ్‌మస్రూర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో జీవాలను ఆదుకునేందుకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో పెద్దఎత్తున నీటితొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. మండలానికి ప్రస్తుతం 49 మంజూరు నీటితొట్టెలు మంజూరు చేయడం జరిగిందని భవిష్యత్తులో 200 తొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలతో పాటు పశువుల క్షేమం కూడా ప్రభుత్వం కోరుకొంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మంచూరు గురు, రామాచార్లపల్లె ప్రతాప్, స్కూల్ కమిటీ చైర్మెన్ సోనియా, రమణయ్యనాయుడు, మురహరి, నాగరాజు, రమణ, బాలప్పగారి వెంకటరమణ, చికెన్‌సెంటర్ రాజా, వెలుగు సిసి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా ఉట్లమాను ఉత్సవం



ఉట్లమాను కార్యక్రమాన్ని తిలకించేందుకు విచ్చేసిన గ్రామ సర్పంచ్

కురబలకోట, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :

కురబలకోట మండలం ఎర్రబల్లిగ్రామం సింగన్నగారిపల్లె వెలసిన శ్రీ చిన్నతోట గంగమ్మ తిరుణాలను పురష్కరించుకొని మంగళవారం గుడివద్ద ఉట్లమాను ఉత్సవాన్ని నిర్వహించారు. చిన్నతోట గంగమ్మ తిరుణాలకు సోమవారం రాత్రి భక్తులు చాందీనిబండ్లు కట్టి, పిళ్ళనగ్రోవి,కోలాట భజనలతో ఊరేగించి, గుడిచుట్టూ ప్రదక్షణలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించారు. మంగళవారం పగలు తిరుణాల జరిగింది. పలు గ్రామాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని గుడివద్ద జంతుబలి ఇచ్చారు. సాయంత్రం గుడివద్ద ఉట్లమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో యువత పాలుపంచుకొని తమ ప్రతిభను కనపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువత ప్రత్యేక నగదు బహుమతులను ఆ గ్రామ సర్పంచ్ నాగరత్న ఈశ్వర్‌లు అందజేశారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎర్రబల్లి సర్పంచ్ నాగరత్న ఈశ్వర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముదివేడు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అమ్మవారి లడ్డూ వేలం

మదనపల్లె, ఏప్రిల్ 1 ప్రభాతవార్త :



వేలంలో లడ్డూను దక్కించుకొన్న దృశ్యం

శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూ వేలంలో పలువురు పోటీలు పడ్డారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ పురాణం చంద్రశేఖర్ రూ.27,500లకు దక్కించుకొన్నారు. అలాగే అమ్మవారికి వచ్చిన చీరలు,జ్యోతి నాణేములు వేలం వేశారు. భక్తులకు జ్యోతి ప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి రత్నమయ్య, ఉప్పు రామచంద్ర, నాగరాజు, నీలకంఠ, సిద్దప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

రైల్వే కోడూరు, అర్బన్, ఏప్రిల్ 1, ప్రభాత వార్త.

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం..అధికారంలోకి వచ్చిన మరుక్షణమే..ఒకే ఒక్క సంతకంతో పింఛన్ రూ. 4 వేలకు పెంచిన ఘనత..ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని ముక్కాసాయివికాస్ రెడ్డి అన్నారు.ప్రతి నెల 1 వ తేదీనే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదల సేవలో కార్యక్రమంలో బాగంగా కోడూరు పట్టణం,శెట్టిగుంట, ముక్కావారిపల్లి వడ్డిపల్లి గ్రామంలో పర్యటించిన తెలుగుదేశం యువనేత ముక్కాసాయివికాస్ రెడ్డి అర్హులైన లబ్దిదారులకు వారి ఇళ్ల దగ్గరే స్వయంగా పింఛన్లను అందజేసారు. పేదలకు ప్రతి నెల క్రమం తప్పకుండా పింఛన్లు అందిస్తూ వారి జీవితాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందని ముక్కా సాయివికాస్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో లబ్దిదారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అవధూతేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు



కడప కార్పొరేషన్, ఏప్రిల్ 01 ప్రభాతవార్త:

శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర స్వామి వారి 47వ ఆరాధన మహోత్సవాలు విశ్వావసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ తదియ మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు శ్రీ అవధూతేంద్ర స్వామి జ్ఞాన మందిర్ కమిటీ చైర్మన్ జివి.రమణ తెలిపారు. కడప నగరం పాత బస్టాండ్ లో వెలసిన శ్రీ అవధూతేంద్ర స్వామికి ఆలయ అర్చకులు తెల్లవారుజామున 4 గం.లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. స్వామివారిని అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అవధూతేంద్ర స్వామి జ్ఞాన మందిర్ కమిటీ చైర్మన్ జివి.రమణ మాట్లాడుతూ ఆశ్రయించిన భక్తకోటిని అవధూతేంద్ర స్వామి తరింప చేస్తున్నారని తెలిపారు. సా. 7 గం.లకు నగర పురవీధుల్లో విశేష భక్తజన సమూహము నడుమ ఊరేగింపు నిర్వహించినట్లు చెప్పారు. రాత్రి హరికథ అనంతరం అన్నమయ్య సంకీర్తనల కార్యక్రమం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ పయ్యావుల వేణుగోపాల్, జనసేన నాయకులు మాలే శివ, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలి



బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త

వేసవి కాలంలో నీరు వృధా చేయకుండా అవసరం మేరకే వాడుకోవలెనని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పురపాలక కార్యాలయం వద్ద నీటి సరఫరా చేయు సిబ్బంది తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ కుళాయిలు అన్నీ కూడా తక్షణమే రెగ్యులర్ చేయించాలని చేయించుకొని పక్షంలో కుళాయిలు తొలగించాలని సిబ్బందికి తెలిపారు. ఇక మీదట బద్వేల్ పురపాలక సంఘం నందు ప్రతి రోజూ నీళ్ళు వదలడం కోసం సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కొంత మంది పురపాలక సంఘం ద్వారా అందించే త్రాగునీరు మునిసిపాలిటీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనులకు, స్లాబ్, క్యూరింగ్ మరియు ఇతర నిర్మాణ పనులకు వాడుతున్నట్లు తెలిసిందన్నారు. బ్రహ్మసాగర్ నుండి మునిసిపాలిటీ అందించే త్రాగునీటిలో తగు మోతాదులో క్లోరిన్ వుండడం వలన సదరు నీటిని స్లాబ్, క్యూరింగ్ ఇతర ఎలాంటి నిర్మాణ పనులకు వాడిన ఇనుము,సిమెంట్ తదితర వాటితో రియాక్షన్ జరిగి ఇంటి నిర్మాణాలు త్వరగా పాడవుతాయని తెలిపారు. నీరు సరఫరా చేయు సిబ్బంది నిత్యం తిరుగుతూ ప్రజలకుపై విషయాల అవగాహన కల్పించి ఎవరైతే అట్లు కనెక్షన్ తీసుకున్నరో ఆ కుళాయి కనెక్షన్‌లు తక్షణమే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్‌తో పాటు డీఈఈ సుమన్‌రెడ్డి మరియు మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడండి

## సిబ్బందికి సూచించిన కమిషనర్ రాముడు



మరమత్తులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు , కౌన్సిలర్ భార్గవి.

పులివెందుల,ఏప్రిల్ 1,ప్రభాత వార్త:

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక మారుతి హాల్ వీధి నందు నీటి సరఫరా సమస్య వున్నదని తెలుసు కొని వెంటనే స్పందించి అక్కడ గల మోటరు ను మరమ్మతులు చేయించారు. పట్టణము నందు నీటి సరఫరా కు అంతరాయం కలగ కుండా చూస్తామన్నారు. ప్రజలు కూడా ఈ వేసవి నందు నీటిని వృధా చేయకుండా పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ లక్ష్మి భార్గవి, మున్సిపల్ డి ఈ చిదానంద రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నపిల్లలపై మానభంగాలకు పాల్పడితే ఫోక్స్ యాక్ట్ కింద కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

పులివెందుల,ఏప్రిల్ 1, ప్రభాతవార్త:

చిన్న పిల్లలపై అత్యాచారాలు, మానభంగాలకు పాల్పడితే ఫోక్స్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి యం. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సమీకృత బాలికల వసతి గృహము నందు మంగళవారం మధ్యాహ్నం హాస్టల్ నందు పులివెందుల మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వారు మాట్లాడుతూ చిన్నపిల్లలపై రోజురోజుకు అత్యాచారాలు అఘాయిత్యాలు జరుగుతున్నాయి వాటిని నిరోధించుట కొరకు సుప్రీంకోర్టు 2012 నవంబర్ 12వ తేదీన పోక్స్ యాక్ట్ ప్రవేశపెట్టినారు. ఎవరైనా మీ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. విద్యార్థినులు ధరించే దుస్తులు కూడా మంచిగా ఉండాలనీ, ఎవరికి భయపడాల్సిన పనిలేదన్నారు. మీకేమన్నా సమస్యలుంటే 1500 నెంబర్ కు ఫోన్ చేసిన లేదా 100 ఫోన్ చేసిన తక్షణమే పోలీసులు సంబంధించి చర్యలు తీసుకుంటారన్నారు. తల్లిదండ్రులకు విధేయత ఉండి మంచిగా చదువుకొని వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వి కిషోర్ కుమార్ రెడ్డి. పాలగిరి ప్రకాష్ మరియు వార్డెన్ కళావతి విద్యార్థులు పాల్గొన్నారు .

# శ్రీ వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

రామసముద్రం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువై ఉన్న అతిపురాతన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బటర్ ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అర్చనలు, పంచామృతాభిషేకాలు, విశేషా అలంకరణలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు కులశేఖర్ బటర్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.